సాక్షి
విజయనగరం
బుధవారం। 6। నవంబర్। 2024



టెట్‌లో రాణించిన పేదింటి బిడ్డలు

టెట్‌లో పేదింటి విద్యార్థినులు రాణించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు. - 8లో



కాంట్రాక్ట్ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలి - 8లో

కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు కోరారు.



కరెంట్ దొంగలపై కొరడా..!

అక్రమంగా విద్యుత్ వినియోగించేవారిపై విద్యుత్ శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు మెంటాడ విద్యార్థులు ఎంపిక

మెంటాడ: అన్నమయ్య జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మెంటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారు. అండర్–14 విభాగంలో ఎస్.చంద్రమౌళి, దిలీప్, జి.భోగిరాజు, టి.అఖిల్, బి.నితిన్, అండర్–17 బాలికల విభాగంలో కె.తనూజ, టి.కావ్య ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం సీహెచ్ అరుణ, పీడీ టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం అభినందించారు.

రాజరాజేశ్వరిదేవి విగ్రహానికి ఆదిత్యుని కిరణ స్పర్శ



రాజరాజేశ్వరిదేవి అమ్మవారి విగ్రహాన్ని తాకిన ఆదిత్యుని లేలేత కిరణాలు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరి దేవి అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం ఉదయం భానుడి లేలేత కిరణాలు స్పృశించాయి. ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన భక్తులు తన్మయత్వం చెందారు. దూసి శ్రీధర్ శర్మ మంత్రోచ్ఛరణాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కుటుంబం చెంతకు బాలుడు



బాలుడితో ఎస్ఐ సురేష్ బృందం

బీచ్‌రోడ్డు (విశాఖ): తప్పిపోయిన బాలుడిని పోలీసులు కుటుంబం చెంతకు చేర్చారు. విశాఖపట్నం మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన టి.స్వరూప్‌కుమార్ విజయనగరంలోని ఆశ్రమంలో మూడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఆశ్రమం నుంచి దారి తప్పి విశాఖ చేరుకున్నాడు. సిరిపురం ప్రాంతంలో రోడ్డుపై అనుమానస్పదంగా తిరుగుతుండడంతో అక్కడ విధుల్లో ఉన్న ఎస్ఐ సురేష్ బృందం గమనించింది. బాలుడు దగ్గరకు వెళ్లి వివరాలు అడగ్గా ఆశ్రమం నుంచి వచ్చినట్లు తెలిపారు. దీంతో బాలుడు తాతయ్య, మావయ్యకు సమాచారం అందజేశారు. వారు విశాఖ రాగా..బాలుడిని అప్పగించారు.

జాతీయస్థాయి పోటీలకు ఆశ్రమ విద్యార్థిని



విద్యార్థిని నైమిశాను అభినందిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండలంలోని పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని ఎస్.నైమిశా షాట్‌పుట్ విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. లక్నోలో జరగనున్న షాట్‌పుట్ పోటీల్లో పాల్గొననున్న విద్యార్థినిని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర మంగళవారం అభినందించారు.

చెత్త బండి.. మూలకు చేరిందండి..



చెత్త తరలించే బళ్లు ఇదిగో ఇలా వృథాగా బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలో పడి ఉన్నాయి. స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ నిధుల నుంచి మొత్తం 48 తోపుడు బళ్లను కొనుగోలు చేశారు. మున్సిపాలిటీలోని వీధుల నుంచి చెత్తను తరలించేందుకు వీటిని వినియోగించాలి. ఇందులో కొన్ని మరమ్మతులకు గురికాగా 16 తోపుడు బళ్లను కొత్తగా కొనుగోలు చేశారు. ఇవి వచ్చేలోగా మరమ్మతులకు గురైన వాటిని బాగు చేశారు. వీటిని కూడా వినియోగించకుండా ఇదిగో ఇలా వృథాగా వదిలేశారు. చెత్తబళ్లు మరమ్మతులకు గురైన సమయంలో వీటిని వినియోగిస్తామని పర్యావరణ ఇంజినీరు సోమేశ్వరరావు తెలిపారు. – బొబ్బిలి



రామభద్రపురం: చవితి వేడుకలకు పొలంబాట పట్టిన కుటుంబం

భక్తిశ్రద్ధలతో చవితి పూజలు

జిల్లావాసులు నాగులచవితి పూజలను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఇంటిల్లిపాదీ పొలాలు, కళ్లాల్లో ఉన్న పుట్టలవద్దకు వెళ్లారు. పుట్టలో పాలు పోసి, చలివిడి ముద్దలను నాగదేవతకు నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాల్చి చవితి పండగను సంబరంగా జరుపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: అలజంగి సమీపంలోని తోటలో పుట్టలో పాలు పోస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



రామభద్రపురంలో పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు



వంగర: కొప్పరవలసలో చవితి సందడి

- 3 నెలలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.6.75 కోట్లు కేటాయింపు
- కూటమి సర్కారు 3 నెలలకు రూ.6.65 కోట్ల కేటాయింపు
- గతంలో కంటే రూ.12 లక్షలు తగ్గింపు
- జీజీహెచ్‌కు 607 రకాల మందులు సరఫరా చేయాలి



మందుల బడ్జెట్‌లో కోత!



ఆస్పత్రులకు మందుల సరఫరా ఇలా...

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి 607 రకాల మందులు, 377 రకాల సర్జికల్ మెటీరియల్, సీహెచ్‌సీలకు 362 రకాల మందులు, 377 రకాల సర్జికల్ మెటీరియల్, పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలకు 172 రకాల మందులు, 377 రకాల సర్జికల్ మెటీరీయిల్ సరఫరా చేయాలి. పారాసిటమల్, సిట్రజిన్, డైక్లోఫినిక్, సెఫిక్సిజమ్, ఎమాక్సిలిన్, ఎమాక్సిక్‌లెవ్, రెంటాక్, పేంటాప్, ఎవిల్, ఎటినిలాల్, ఆమిప్లిడిన్ తదితర మందులను అందజేస్తారు. గ్లౌజులు, కాటన్, బ్యాండెజ్, ఆయింట్ మెంట్స్, సిరంజులు, నీడిల్స్, ఆపరేషన్ థియేటర్‌లో ఉపయోగించే క్లాత్‌లు, ఇతర డ్రెసింగ్ మెటీరియల్ తదితర సర్జికల్ మెటీరియల్స్ ఆస్పత్రులకు సరఫరా చేస్తారు.

విజయనగరం ఫోర్ట్:

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోతలు ఆరంభమయ్యాయి. ప్రజా సంక్షేమ పథకాల్లో కోత పడింది. లబ్ధిదారులకు ఆవేదనే మిగిలింది. తాజాగా ప్రభుత్వాస్పత్రులకు మందుల బడ్జెట్ కేటాయింపులోనూ కోత విధించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పేద, మధ్యతరగతి వారికి ఎలాంటి ఆరోగ్యసమస్య వచ్చినా ముందుగా ఆశ్రయించేది ప్రభుత్వాస్పత్రులనే. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ప్రభుత్వాస్పత్రులు... ఇలా వారికి అందుబాటులో ఉన్న ఆస్పత్రిలో చేరి వైద్యసేవలు పొందుతారు. వ్యాధి నివారణలో మందులది కీలకభూమిక. మందులు పూర్తి స్థాయిలో వాడితేనే జబ్బు నయం అవుతుంది. రోగులకు వ్యాధి నయమయ్యే వరకు మందులు అందజేయాలి. దీనికోసం ఆస్పత్రులకు సమృద్ధిగా ప్రభుత్వం మందులు సరఫరా చేయాలి. అందుకు అవసరమైన బడ్జెట్ కేటాయించాలి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మందుల కొనుగోలుకు కేటాయించిన బడ్జెట్‌లో కోత విధించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై రోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు.

రూ.12 లక్షలు తగ్గింపు..

జిల్లాలో ఉన్న ఆస్పత్రులకు మందులు నిమిత్తం ప్రతి మూడు నెలలకు (క్వార్టర్లీ) ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడు నెలలకు రూ.6.75 కోట్లు కేటాయించగా, ప్రస్తుత కూటమి సర్కారు రూ.6.65 కోట్లు కేటాయించింది. గతంలో కంటే రూ.12 లక్షలు తక్కువగా కేటాయించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023–24 సంవత్సరంలో రూ.27.09 కోట్లు కేటాయించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024–25 (9 నెలలకు) సంవత్సరానికి రూ.19.95 కోట్లు మాత్రమే కేటాయించింది. మందుల బడ్జెట్ పెంచాలే తప్ప కోత విధించడంపై వైద్యవర్గాలు విస్మయం చెందుతున్నాయి.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న రోగుల బంధువులు

ఏడాదికి 3.74 లక్షల ఓపీ:

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏడాదికి 3,74,711 మంది అవుట్ పేషెంట్‌లు, 39,919 మంది ఇన్‌పేషెంట్‌లు వైద్యసేవలు పొందుతున్నారు. మేజర్ ఆపరేషన్లు 4,601, కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు 737, ప్రసవాలు 4,991, అల్ట్రాసౌండ్ స్కాన్‌లు 14,776, ఎక్స్‌రేలు 24,182, ఈసీజీలు 16,885 మందికి ఈ ఏడాదిలో ఇప్పటివరకు తీశారు. వైద్య పరీక్షలు 5,97,669 మందికి చేశారు. సేవల సంఖ్య పెరుగుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కోత విధిస్తూ ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మార్చేందుకు ప్రయత్నిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

> **బడ్జెట్ రావాల్సి ఉంది**
>
> గత ఏడాది జిల్లాకు మందులు బడ్జెట్ కోసం ప్రభుత్వం రూ.27.09 కోట్లు వెచ్చించింది. ఈ ఏడాది 9 నెలలకు రూ.19.95 కోట్లు కేటాయించింది. ఇంకా ఒక క్వార్టర్ బడ్జెట్ రావాల్సి ఉంది. గత ఏడాదివలే ఈఏడాది కూడా నాల్గో క్వార్టర్‌తో నిధులు కలిపి ఇచ్చే అవకాశం ఉంది.
>
> – కళ్యాణ్, ఫార్మసీ ఆఫీసర్, సెంట్రల్ డ్రగ్ స్టోర్

సింగిల్ విండోలో అనుమతులు

విజయనగరం అర్బన్: జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బరిలో దిగే అభ్యర్థులకు హెలిప్యాడ్ ఏర్పాటు, సభలు, సమావేశాలు నిర్వహణ, వాహనాలకు లౌడ్ స్పీకర్లు అమర్చేందుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్ విండో సెల్‌కు నోడల్ అధికారిగా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎల్.జోసెఫ్‌ను నియమిస్తున్నామన్నారు. పోలీస్, రోడ్లు, భవనాలు, ఫైర్, విద్యుత్, పురపాలక, రవాణా శాఖల అధికారులు ఈ సింగిల్ సెల్‌లో పనిచేస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ సింగిల్ విండో సెల్ పని చేస్తుందన్నారు.

ముగిసిన విలువిద్య పోటీలు



మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణన్

సీతానగరం: జోగింపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ ప్రాంగణంలో డీఈఓ, జిల్లా క్రీడాధికారి డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి విలువిద్య (ఆర్చరీ) పోటీలు మంగళవారంతో ముగిశాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృ మాట్లాడుతూ 13 ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారన్నారు. ఇక్కడ ఎంపికైన వారు గుజరాత్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రానికి పేరుతేవాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన వారికి రూ 2.5 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.1.5 లక్షలు, తృతీయస్థానం సాధించిన క్రీడాకారులకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి అందజేస్తారని తెలిపారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రోత్సాహంతో ఇక్కడ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్టు వెల్లడించారు. విలువిద్య క్రీడల రాష్ట్ర పర్యవేక్షకుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ పదమూడు జిల్లాల నుంచి అండర్–14, 17, 19 విభాగాల్లో పోటీలకు హాజరైన బాల, బాలికలకు జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు చక్కని అతిథ్యం ఇచ్చారన్నారు. డీఈఓ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు మాట్లాడుతూ విలువిద్య పోటీలను పార్వతీపురం మన్యం జిల్లా జోగింపేటలో నిర్వహించడం అభినందనీయమన్నారు. జోగింపేటలో మూడు రోజులపాటు క్రీడల నిర్వహణకు సహకరించిన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ మధుబాబు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ రాజ్‌కుమార్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, ఎంఈఓలు కె.ప్రసాదరావు, సూరిదేముడు, తదితరులు పాల్గొన్నారు.



విలువిద్య పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కంచమ్మా.. కరుణించమ్మా..

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మొక్కుబడుల చెల్లింపు
- భక్తుల సేవలో స్వచ్ఛంద సేవకులు



కంచమ్మతల్లికి పూజలు పూజలు చేస్తున్న భక్తులు

మెరకముడిదాం: మండలంలోని కొండలావేరు గ్రామ సమీపంలో బోడికొండపై వెలసిన కంచెమ్మతల్లి జాతరకు భక్తులు పోటెత్తారు. ఏటా నాగులచవితి నాడు జాతర నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం నిర్వహించిన జాతరలో మండలవాసులతో పాటు చీపురుపల్లి, గరివిడి, గుర్ల, తెర్లాం, బొబ్బిలి, బాడంగి, దత్తిరాజేరు మండలాలకు చెందిన వారితో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పసుపుకుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఉదయం 7 గంటల నుంచి పెరిగిన భక్తుల తాకిడి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. క్యూలు కిక్కిరిశాయి. సుమారు 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించినట్టు ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, ప్రసాదాలను పలువురు స్వచ్ఛంద సేవకులు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బుధరాయవలస ఎస్ఐ జి.లోకేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.



కంచమ్మతల్లి దర్శనానికి బారులుతీరిన భక్తులు

విరిసిన పూల సిరి



బొబ్బిలిరూరల్: కారాడ-పినపెంకి రోడ్డు పక్కన విరబూసిన పూలతోట



రామభద్రపురం అంతర్‌రాష్ట్ర మార్కెట్‌లో బంతి పూలు విక్రయిస్తున్న రైతులు



కార్తీక పుణ్య మాసంలో ఆలయాల అలంకరణ, అభిషేకాలు, పూజలకు పూల వినియోగం పెరిగింది. ఇది రైతన్నకు సిరులు కురిపిస్తోంది. రామభద్రపురం అంతర్‌రాష్ట్ర మార్కెట్‌లో కేట్ బంతి పూలు రూ.400 నుంచి రూ.500 పలుకుతుండగా, బొబ్బిలి మార్కెట్‌లో కిలో బంతి పూలు రూ.250, కిలో చామంతి పూలు రూ.600 ధర ఉంది. ఈ ప్రాంతంలో కొనుగోలుచేసిన పూలను పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో సాగుచేసిన పూలతోటలు చూపరులకు కనువిందు కలిగిస్తున్నాయి. మగువలను హత్తుకుంటున్నాయి. పూలకు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు సంతోషపడుతున్నారు. – రామభద్రపురం/బొబ్బిలిరూరల్

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

- ప్రత్యేక అధికార బృందాల నియామకం
- కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం అర్బన్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కోసం ప్రత్యేక అధికార బృందాలను నియమించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ మండల స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును ఈ బృందాలు పర్యవేక్షిస్తాయని చెప్పారు. మున్సిపల్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐలు, గ్రామీణ ప్రాంతాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్ఐలు బృందంలో సభ్యులుగా ఉంటారన్నారు. మొత్తం 23 బృందాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. వీటికి అదనంగా బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, నెలిమర్ల, విజయనగరం, ఎస్.కోటలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అక్రమ నగదు వ్యవహారాలు, అనుమానాస్పదంగా ఉన్న నగదు బదిలీలు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు జరిగే ప్రయత్నాలపై నిఘా ఉంచుతాయని పేర్కొన్నారు. నిర్ణీత ప్రదేశంలో చెక్ పోస్టులు ఏర్పాటుచేసి పెద్ద మొత్తంలో నగదు, మద్యం వంటి అక్రమ రవాణాను నిరోధించేందుకు ఈ బృందాలు పనిచేస్తాయని తెలిపారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటిప్రశాంత్‌లు విశిష్ట కుంకుమార్చన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఫైలేరియా వ్యాధి నిర్ధారణ సర్వే


పెదపెంకిలో రక్త నమూనాలు తీస్తున్న అధికారులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ నిమిత్తం సోమవారం రాత్రి 340మందికి నైట్ బ్లడ్ సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా మలేరియా నివారణ అధికారిణి మణి ఆధ్వర్యంలో రక్త నమూనాలు తీశారు. మైక్రో ఫైలేరియా క్రిమి రాత్రి(విశ్రాంత) సమయంలో చర్మం పైపొరలోకి వస్తుందని ఆ సమయంలో వ్యాధి నిర్ధారణ నిమిత్తం రక్తనమూనా తీస్తే నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే గ్రామంలో కొంతమందికి మాత్రమే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రకారం పరీక్షలు నిర్వహించి నిర్ధారణ తరువాత చర్యలు చేపట్టనున్నట్లు అధికారిణి మణి తెలిపారు. కార్యక్రమంలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి. సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, విజయనగరం జిల్లా మలేరియా అధికారులు, సిబ్బంది, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

మృతిచెందిన పోలీసు కుటుంబానికి చేయూత


వెంకటేశ్వర్లు కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేసి, ఇటీవల మృతిచెందిన ఎస్సై కుటుంబానికి చేయూతనందించేందుకు పోలీసు సిబ్బంది పోగుచేసిన మొత్తాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన కె.వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు పోలీసు సిబ్బంది పోగుచేసిన రూ.లక్షా 48వేల చెక్కును మృతుడి సతీమణి బంగారమ్మకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ న మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు, ఆకస్మికంగా, అనారోగ్యంతో మృతిచెందిన పోలీసు కుటుంబాలు అర్ధాంతరంగా కుటుంబ యజమానిని కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన సమయంలో ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ అందేంత వరకూ పోలీసుశాఖ ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, కొంతమొత్తాన్ని పోగు చేసి, బాధిత కుటుంబాలకు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ పి.శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ ఏఎస్‌వీ ప్రభాకరరావు, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విజయనగరం ఫోర్ట్: బాలల సంరక్షణ కేంద్రాలన్నీ జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ) చట్టం 2025 సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా సీసీఐ ఇన్‌స్పెక్షన్ ఇన్‌చార్జి ఓవీఎల్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం నిర్దేశించిన ప్రొఫార్మాలో నింపిన దరఖాస్తుతో పాటు అన్ని కాపీలు జతచేసిన దరఖాస్తును ఈనెల 11 వతేదీలోగా సంచాలకుడు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ విజయవాడ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

టెట్‌లో రాణించిన పేదింటి బిడ్డలు

- టెట్ ఫలితాల్లో సత్తా చాటిన పేద నిరుద్యోగినులు

విజయనగరం అర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా పోటీని ఎదుర్కొని ప్రతిభను చూపడం అందరికీ సాధ్యమైన పని కాదు. ముఖ్యంగా ఉద్యోగ సాధన పేదలకు మరింత కష్టతరం. పట్టుదల, ఏకాగ్రత ఉంటే ఎవరైనా, ఏదైనా సాధించవచ్చని విజయనగరం పట్టణానికి చెందిన ఇద్దరు పేద నిరుద్యోగినులు నిరూపించారు. రోజు కూలీ బతుకుల నేపథ్యం గల వారి తల్లిదండ్రులు పిల్లలకు తెలివితేటలు ఉన్నప్పటికీ పై చదువులు చదివించలేని ఆర్థిక పరిస్థితి వారిది. ఇంటర్మీడియట్‌తోనే చదువు ఆపేసి బోధన వృత్తిపై ఆసక్తి పెంచుకున్న ఇద్దరు పేద నిరుద్యోగినులు ఉపాధ్యాయ పోస్టుల సాధనకు సాన పట్టారు. డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీ కోసం తొలుత జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో సత్తా చాటి తొలి రెండు స్థానాలు సాధించారు.


తల్లిదండ్రులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ అశ్విని

పవిత్ర గురు వృత్తి లక్ష్యంగా..

ఏపీ టెట్ పోటీ పరీక్షలో 150/150 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచాను. పట్టణంలోని కస్పా మున్సిపల్ స్కూల్లో పదో తరగతి, అదే కస్పా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. ఇంకా పైచదువులు చదివి బోధన వృత్తిలో స్థిరపడాలనుకున్నాను. మా తండ్రి శంకరరావు ఆటో డ్రైవింగ్‌తోనే మా కుటుంబ పోషణ. పై చదువులు చదివే స్థోమత లేకపోవడంతో ఇంటర్మీడియట్‌తో పైచదువులు ఆపేసి టీచర్స్ ట్రైనింగ్ కోర్స్ చేశాను. డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగం తెచ్చుకోవాలని లక్ష్యంగా చేసుకున్నాను. తల్లిదండ్రుల సహకారంతో ఆ లక్ష్యాన్ని సాధించుకుంటున్నాను. త్వరలో జరిగే డీఎస్సీ పరీక్షల్లో కూడా ప్రతిభ చూపి మంచి మార్కులు తెచ్చుకోవాలని కృషి చేస్తున్నాను.

– టెట్‌లో స్టేట్‌ఫస్ట్ ర్యాంకర్ కోండ్రు అశ్విని


తల్లిదండ్రులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ ధనలక్ష్మి

టీచర్ పోస్టు సాధిస్తాను

ఏపీ టెట్‌లో ఎస్జీటీ కేటగిరి పోస్టు పరీక్షలో 149.99/150 మార్కులు తెచ్చుకుని రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించాను. చిన్నప్పటి నుంచి టీచర్ ఉద్యోగం అంటే నాకు ఇష్టం. టీచర్ అవ్వాలంటే ఇంటర్మీడియట్, టీచర్ ట్రైనింగ్ శిక్షణ కోర్సు చదివితే సరిపోతుందని తెలుసుకుని ఆ చదువులు పూర్తి చేశాను. జూన్‌లో జరిగిన టెట్‌లో కూడా మంచి మార్కులు వచ్చాయి. పట్టణంలోని వీటీ అగ్రహారం మా నివాసం. నాన్న వెల్డింగ్ షాప్‌లో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు. అమ్మ ఈశ్వరమ్మ గృహిణి. త్వరలో జరిగే డీఎస్సీ పోటీ పరీక్షల్లో మంచి మార్కులతో టీచర్ పోస్ట్ సాధిస్తాను.

–దాసరి ధనలక్ష్మి, టెట్ రాష్ట్రస్థాయి సెకెండ్ ర్యాంక్

టెట్ టాపర్స్‌కు కలెక్టర్ అభినందన

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అత్యున్నత ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయిలో మొదటి, రెండవ ర్యాంకులను సాధించిన విద్యార్థినులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభినందించారు. టెట్‌లో జిల్లాకు చెందిన కోండ్రు అశ్విని 150కి 150, దాసరి ధనలక్ష్మి 149.99 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే 149.56 మార్కులను సాధించిన చీపురుపల్లికి చెందిన దేవ హారిక మరికొందరితో పాటు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ ముగ్గురు విద్యార్థినులను కలెక్టర్ అంబేడ్కర్ తన ఛాంబర్‌లో మంగళవారం అభినందించారు. ఇదే పట్టుదలతో చదివి ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని, మరింత ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. ర్యాంకర్లతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు పాల్గొన్నారు.


టెట్ ర్యాంకర్లను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్

కాంట్రాక్ట్ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలి

- మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేత


మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు

సాలూరు: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించాలని స్త్రీశిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు సాలూరు పట్టణంలో ఆమె స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత 10 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా తాము పనిచేస్తున్నామన్నారు. తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించి, తమను రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1284 మంది ఉపాధ్యాయులం ఉన్నామని తెలియజేశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రశేఖర్, బాలరాజు, గణపతిరావు, త్రినాథ, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం

- డీఎస్పీ రాఘవులు


వివరాలు ఆరా తీస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: పట్టణంలో ఈ నెల 2వ తేదీ రాత్రి జరిగిన దొంగతనం కేసులో నిందితులను త్వరలో పట్టుకుంటామని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. మున్సిపాల్టీ పరిధి పాలకొండ రోడ్డులో 27 తులాల బంగారం చోరీ జరిగిన సలాది శేషగిరిరావు ఇంటిని డీఎస్పీ మంగళవారం సందర్శించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించి బాధితుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుని బాధితులకు న్యాయం చేస్తామని వెల్లడించారు. డీఎస్పీతో పాటు రాజాం రూరల్ సీఐ హెచ్‌ఉపేంద్ర ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక ఎమ్మార్వో కార్యాలయం సమీపంలోని బాసినివీధిలో అనుమానాస్పద రీతిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బాసిన వీధిలో ఉంటున్న కూన రాజేష్ (36) సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోనే పురుగు మందు కలిపి మద్యం తాగి మృతిచెందినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్లుగా రాజేష్ కుటుంబానికి దూరంగా ఉంటూ పోషణ నిమిత్తం ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ తగాదాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సింగిల్‌గా ఇక్కడ ఉంటున్నాడు. మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఏవైనా ఇతరత్రా కారణాలున్నాయా? అనే కోణంలో విచారణ చేపట్టామని, అనుమానాస్పద మృతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఈ నెల 3వ వారంలో ధాన్యం కొనుగోలు


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

- జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్

విజయనగరం అర్బన్: ఈ నెలలో మూడో వారం నుంచి జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభం కానుందని, దీనికోసం ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా ఈ ప్రక్రియను నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 3,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించే అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జేసీ మంగళవారం పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరను కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. పరిస్థితులు, పంట దిగుబడిని బట్టి జిల్లాను 258 క్లస్టర్లుగా విభజించామని, ఒక్కో క్లస్టర్‌లో రెండు లేదా మూడు రైతు సేవా కేంద్రాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని 501 రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, రైతుమిత్ర సంఘాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది సుమారు 26 లక్షల గోనె సంచులు అవసరమని, ఒక్కో మిల్లుకు దాని సామర్థ్యాన్ని బట్టి 30వేల గోనె సంచులను సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. ధాన్యం తరలించేందుకు సుమారు 3,000 వాహనాలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జీపీఎస్ సదుపాయం కలిగిఉండి, సివిల్ సప్లయిస్ వద్ద నమోదు చేసుకున్న వాహనాల ద్వారా మాత్రమే ధాన్యం తరలింపు జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు జేసీ స్పష్టం చేశారు. ఈ-పంట నమోదు చేసుకుని ఈ-కేవైసీ పూర్తయిన రైతులు, తమ ధాన్యం విక్రయించేందుకు సిద్ధమైన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, జిల్లా సహకార అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ దొంగలపై కొరడా..!

- ఆకస్మిక తనిఖీలతో కేసులు నమోదు చేస్తున్న విద్యుత్‌శాఖ
- కేసుల నమోదు, జరిమానా విధింపు


అక్రమ విద్యుత్ వాడకం పోస్టర్

విజయనగరం ఫోర్ట్: అక్రమంగా విద్యుత్ వినియోగించేవారిపై విద్యుత్ శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ విభాగంతో పాటు ఆ శాఖ అధికారులు తరచూ తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలో లైటింగ్స్, ప్రైవేట్ ఫంక్షన్స్‌కు కొంతమంది విద్యుత్ లైన్ నుంచి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారు. మరి కొంతమంది గృహ విద్యుత్ మీటర్‌తో చిన్నపాటి పిండి మిల్లులు, దుకాణాలు వంటివి నిర్వహిస్తున్నారు. ఇటువంటి అక్రమ వినియోగం వల్ల విద్యుత్‌శాఖకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లుతోంది.

2024–25లో 567 కేసుల నమోదు

విద్యుత్‌శాఖకు చెందిన విద్యుత్ చౌర్య తనిఖీ విభాగం (విజిలెన్స్), ఆపరేషన్ ఇంజినీర్స్ వేర్వేరుగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 2024–25 అక్టోబర్ నెలాఖరు వరకు 567 కేసులు నమోదు చేసి రూ.36.68 లక్షలు అపరాధ రుసుము విధించారు. అదేవిధంగా 2023–24లో 519 కేసులు నమోదు చేసి రూ.17. 70 లక్షలు అపరాధ రుసుం విధించారు.

అత్యాశకు పోయి అడ్డంగా..

ప్రభుత్వం సరఫరా చేసే విద్యుత్ ఎంత వినియోగించినా డబ్బులు కట్టనవసరం లేదు. అదే ఇంట్లో ఉన్న విద్యుత్ వినియోగిస్తే బిల్లు కట్టాలి. బిల్లు కట్టాల్సిన అవసరం లేదనే భావనతో అక్రమంగా విద్యుత్ వినియోగించి అడ్డంగా దొరికిపోతున్నారు. కొంతమంది అత్యాశకు పోయి విద్యుత్ లైన్ ద్వారా అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు పట్టుబడుతున్నారు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు	
కేటగిరి	విద్యుత్ కనెక్షన్ల సంఖ్య
కేటగిరి-1	6,04,535
కేటగిరి-2	65,194
కేటగిరి-3	2,822
కేటగిరి-4	14,168
కేటగిరి-5	38,000

అదనపు లోడ్‌కు అనుమతి అవసరం

అదనపు లోడ్ వాడాలనుకుంటే విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలి. కేటగిరి–1కు తీసుకుని షాపులకు వినియోగించడం నేరం. విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లయితే విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ ఇంజినీర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తారు.

– మువ్వల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

నేటి నుంచి ఆంధ్ర-ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్


చింతలవలస డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రాక్టీస్ చేస్తున్న ఆంధ్రా జట్టు సభ్యులు

విజయనగరం: రంజీ క్రికెట్ సందడికి విజయనగరం వేదిక కానుంది. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరగనున్న క్రికెట్ మ్యాచ్ డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్–ఉత్తరాఖండ్ జట్ల మధ్య బుధవారం ప్రారంభం కానుంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెస్ట్ మ్యాచ్ తరహాలో జరిగే మ్యాచ్‌లో పోటీ పడనున్న ఆంధ్ర జట్టు సభ్యుల వివరాలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబు మంగళవారం ప్రకటించారు. ఆంధ్ర జట్టుకు ఎస్.కె.రషీద్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారని తెలియజేశారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ఇరు జట్ల క్రీడాకారులు చింతలవలస చేరుకుని ప్రాక్టీస్ చేస్తున్నారు. మ్యాచ్‌ను ఉచితంగా చూసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నార్త్‌జోన్ క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ ఎం.వాసుదేవరాజు తెలిపారు.

ఆంధ్ర జట్టు సభ్యులు

ఎస్.కె.రషీద్ (కెప్టెన్), టి.విజయ్, కె.ఎస్.భరత్, జి.హనుమ విహారి, షేక్ ఎం.డి రఫీ, వై.సందీప్, ఎం.వంశీకృష్ణ, ఎం.అభిషేక్ రెడ్డి, కె.వి.శశికాంత్, సి.ఆర్.జ్ఞానేశ్వర్, సి.హెచ్.స్టీఫెన్, పి.వి.సత్య నారాయణరాజు, ఎ.లలిత్ మోహన్, జి.మనీష్, కె.కరణ్ షిండే, ఎం.హేమంత్‌రెడ్డి.

రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దత్తిరాజేరు; మండలంలోని షికారుగంజి మోడల్ పాఠశాల విద్యార్థిని అనూష రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్ మంగళవారం తెలిపారు. అండర్–19 విభాగంలో కొద్ది రోజుల క్రితం విజయనగరంలోని పువ్వాడ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఆమె ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో ఈనెల 7, 8 తేదీల్లో గుంటూరులో జరిగే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అనూషను ఎంఈఓలు వెంకటరావు, సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్‌వర్సిటీ పోటీలకు ముగ్గురు విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులతో నిర్వాహకులు

రాజాం సిటీ: అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు హాజరయ్యేందుకు రాజాం పట్టణంలోని జీసీఎస్ఆర్ కళాశాల వేదికగా నిర్వహించిన ఎంపిక పోటీల్లో ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారని అంబేడ్కర్ యూనివర్సిటీ పీడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జీఎంఆర్ ఐటీ స్పోర్ట్స్ ఎరినాలో నిర్వహించిన ఎంపికలకు యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి 25 మంది విద్యార్థులు హాజరై పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. వారిలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలకు చెందిన డి.హేమశ్రీ 55 కేజీల విభాగం), జి.వర్షిత (64 కేజీల విభాగం) ఎస్.రూన్సీరాణి (76 కేజీల విభాగం)లో ఎంపికయ్యారని ఆయన తెలిపారు. పురుషులు ఎవరూ ఆశించిన స్థాయిలో బరువు ఎత్తకపోవడంతో ఎంపిక చేయలేదని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 25 నుంచి 28 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తం, సీహెచ్ రవీంద్రకుమార్, భాస్కరరావు, జీఎంఆర్ ఐటీ పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, జీసీఎస్ఆర్ పీడీ చీకటి కేశవనారాయణరావు, మహేష్ తదితరులు అభినందించారు.

అంతర్ వర్సిటీ పోటీలకు సత్య కళాశాల జట్ల ఎంపిక


విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్ రావు

విజయనగరం అర్బన్: ఈ నెల మూడో వారంలో జరగబోయే సౌత్‌వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల వెయిట్ లిఫ్టర్ల జట్లు ఎంపిక అయ్యాయి. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయి దేవమణి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విశాఖలోని బుల్లయ్య కాలేజీలో జరిగిన ఆంధ్రయూనిర్సిటీ అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ పోటీలలో సత్య డిగ్రీ, పీజీ కళాశాలకు టీం చాంపియన్‌షిప్‌లో రన్నర్స్‌గా నిలిచి అర్హత పొందారని తెలిపారు. ఈ పోటీలలో విద్యార్థులు సాధించిన పతకాల వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వారు ఎంచుకున్న రంగంలో మిక్కిలి నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం. ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరప్పు నాయుడు, ఫిజికల్ డైరెక్టర్లు మహేష్, ప్రసాద్, కోచ్ చల్లా రాము పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: ప్రాథమిక రంగాల ద్వారా ఇచ్చే ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్యశాఖలకు సంబంధించిన పథకాలు గిరిజనులకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. డిసెంబర్ నాటికి నిధులు ఖర్చు చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమయ్యే వారికి మాత్రమే పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మత్స్యశాఖ పథకాలన్నీ ఆ శాఖ సొసైటీకి అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఎస్.మన్మథరావు, మత్స్యశాఖ జిల్లా అధికారి తిరుపతయ్య, ఏపీడీ సన్యాసిరావు, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, పశుసంవర్ధకశాఖ ఎ.డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోండి

- డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు

విజయనగరం: ఇప్పటివరకు జరిగిన జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు తమ వివరాలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో ఈనెల 6వ తేదీలోగా నమోదు చేసుకోవాలని విజయనగరం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తీసుకురాబోతున్న నూతన క్రీడా పాలసీ ప్రకారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వివరాలు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన, పాల్గొన్న క్రీడాకారులు, ఖేలో ఇండియా స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా వారికి అందజేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఫోన్ 9491767327, 918341052254 (విజయనగరం) 9701648344(మన్యం) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
Plot for Sale : 220 Sq.yds Site 10,000/- per Square Yard at Vashavi Layout Near Ayyannapeta, Vizianagaram. Cont : 92466 24248 [V- 823847]

ASTROLOGY
శ్రీ గాయత్రీ జ్యోతిష్యం : పెళ్ళి, ఆర్థిక , ఉద్యోగం, కుటుంబం సమస్యలు, ప్రేమలో విఫలం, చదువు, ఆరోగ్యం సమస్యలు, సంతానం సమస్యలు, భార్యాభర్త గొడవలు, కోర్టు సమస్యలు, మీకు ఎటువంటి చికాకులు ఉన్న జీవిత శాశ్వతం పరిష్కారం చూపబడును. ఫోన్: 97017 78711 [V- 1943]

WANTED
విజయవాడలో సంపన్నుల / పెద్దవారి ఇళ్ళ వద్దే ఉండి, పేషెంట్లని / Bed Ridden వారిని చూసుకొనుటకు అనుభవం గల కేర్ టేకర్స్ M/F నర్సులు, RMPలు కావలెను. ✆ 91608 35559, 98850 25559 [B-313]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [M-12648]

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253906]

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995365999 [HA-98930]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.